# ముందు హాలాహలము - పిదప అమృతము

"రాజమహేంద్రవరంలో వుండే ప్లీడర్లలోకల్లా మానాన్న వక్కడే చాలా సంపాదించేడు. చిన్నతనంలో వారాలు చేసి చదువుకున్నాట్ట మానాన్న. మరీ చిన్నతనంలో మధూకరం గూడా చేసుకున్నాట్ట కొన్నాళ్ళు. అన్ని చిక్కులు యెవరూ పడి వుండరుట. "చచ్చిపోతే నయం" అనిపించీదట. ఇన్ని కష్టాలు అనుభవించుతూ గూడా మానాన్న చాలా పెంకితనంగా వుండీవాట్ట. అప్పుడేమిటీ? యిప్పుడూ అంతే. అప్పుడు సాగేది కాదు. ఇప్పుడు సాగుతోంది. ఇంతే భేదం"

"ఆడేళ్ళేమిటి మొగాళ్ళేమిటి చాలామంది పెంకితనం గొప్ప అనుకుంటారు గాని దానివల్ల చాలా చిక్కులు వున్నాయి గ్రహించుకుంటే. పెంకిమనిషికి పదిమాట్లు చిన్నచిన్న జయాలు కలిగినా పదకొండోమాటు గొప్ప పరాభవం జరుగుతుంది. జరిగితీరుతుంది."

"ప్లీడరీ ప్రారంభించేటప్పటికి మానాన్నకి పాతికేళ్ళు వున్నాయిట. మా అమ్మ తరవాత సంవత్సరానికి కాపరానికి వచ్చిందట. ఆవిడితో కూడానే వచ్చింది కాబోలు లక్ష్మి. చూస్తూవుండగా మానాన్నకి ఐశ్వర్యం యెత్తుకుపోయిందిట. ఇప్పుడు మానాన్న పాతిక లక్షలకి యజమాని."

"ఏం సుఖమూ? పాతికలక్షలికి యజమానే. ఆకాశం అంటే మేడ, పద్దానుగు వేల మోటారుకారు, కోనసీమని గొబ్బరితోటలు, చేగల్నాడులో మామిడితోటలు, కాలవకింద చెరుకుతోటలు, ఇంట్లో దేవేంద్రభోగం - అదే లోటూ, వున్న యిద్దరు కూతుళ్ళమూ అధీనం తప్పి వుండడం, పెళ్ళాం చచ్చిపోవడం, కొడుకు ల్లేకపోవడం. అంతా అడివిలో కాచిన వెన్నెల అయిపోయింది."

"అయినా మానాన్న పెంకితనమూ, ద్వేషమూ విడువలేదు. తెల్లవారితే వందో రెండువందలో వచ్చిపడతాయి రూపాయలు. శిస్తులకాలంలో కావిళ్ళతో పట్టుకువచ్చి గుమ్మరిస్తారు రైతులు. పళ్ళూ, పాలూ, పెరుగూ, నెయ్యీ, తేనెపానకమూ, బెల్లమూ, రైతులయితే యేమి కక్షిదార్లు అయితే యేమి యిలాంటి సరఫరాలకి అంతులేదు. వచ్చినవన్నీ మేం తినగలమా? మా అమ్మ బతికివున్నప్పుడు యిరుగుపొరుగు వారిలో బీదలంతా చల్లకోసమూ, పాలకోసమూ మా యింటికే వచ్చేవారు. ఒక్కొక్కప్పుడు వాసన వస్తుందని నెయ్యి కూడా పంచిపెట్టేది మా అమ్మ. తేనెపానకం పంచిపెట్టగా యింకా కుండల్లో పులిసి

బురబురలాడుతూనే వుంటుంది. రెండు కుటుంబాల వారికి మా అమ్మ బియ్యం కూడా - వారి సంసారం అంతా మా అమ్మే భరించేది."

"ఆ రోజులు వెళ్ళిపోయాయి. మా అమ్మ చచ్చిపోయింది. ఆవిడ సహాయం పొందడానికే అద్దె యెక్కువ యిచ్చి కూడా మా పొరుగున కాపరం వున్నారు. కొందరు లేచిపోయారు; మానాన్న మాఅమ్మ యెలా ఖర్చుపెట్టినా వూరుకునీవాడు; గాని మమ్మల్ని ఆజ్ఞ పెట్టీవాడు. "మీకు తెలవదు, సంసారం పొక్తు చేసుకోవాలి" అంటే "మాఅమ్మ ఖర్చుపెడితే సంసారం పాడయి పోయిందా నాన్నా" అనీవాళ్ళం. మానాన్న వూరుకునీవాడు."

"మాఅక్కా, నేనూ రెండేళ్ళలో యిల్లు పట్టాము, మా అక్కకి నేనంటే ప్రాణం. నన్నేనక విధాల కనిపెట్టీది. ఏమీ లోటు లేదు. మానాన్న కూడా బాగానే చూస్తాడు."

"మా యింటిపక్కని వొక బ్రాహ్మడు వున్నాడు. ఆయనికో కొడుకు, ఆ కొడుకు పేరు - పేరు - రామశర్మ. ఆయన పదహారేళ్ళ వయస్సులో వుండగా తల్లీతండ్రీ వక్కమాటే పోయారు. ఆయన దిక్కులేక సొంతంగా వండుకోవడం చూసి జాలిపడి మాఅమ్మ మా యింటికి పిలిచింది. మాఅమ్మ బతికివున్నంత కాలమూ ఆయన మా యింట్లోనే భోంచేశారు. తరవాత మానాన్నకీ ఆయనకీ మాట పట్టింపులు వచ్చాయి. ఆయన యిల్లు మాదొడ్లో కలిస్తే మామేడకి చాలా హంగుగా వుంటుంది. కాని యేమిచ్చినా ఆయన యివ్వనన్నాడు. మానాన్న కోప్పడగా ఆయన మా యింటికి రావడం మానేసి మళ్ళీ సొంతంగా వండుకునేవాడు."

"ఏం చేస్తారూ? అప్పుడు ఆయన చాలా బీదవారు. దాసీదాన్ని పెట్టుకోవడానికి శక్తిలేక అంట్లుకూడా స్వయంగానే తోముకునీవారు. పప్పూ, చారూతో కాలం గడిచిపోయీది. పెరుగు మాఅక్క రహస్యంగా యిచ్చేది. అప్పుడప్పుడు ఫలహారాలు కూడా యేమేనా యిస్తూ వుండేది. ఆయన పుచ్చుకోడానికి జంకీవాడు."

"పగబట్టేడు మానాన్న. ఆయన జంకలేదు. బాధలు ప్రారంభం అయేయి. సహించీవాడు ఆయన. వకమాటు నూతిదగ్గిర బట్టలు వుతుక్కు పెట్టుకుని నీళ్ళబింది యింటోకి పట్టుకు వెళ్ళేరు ఆయన. మళ్ళీ వచ్చేలోగా మానాన్న ఆవిడపలమీద తమలపాకులు వేసుకుంటూ - తలుచుకుంటేనే సిగ్గూ. ఇప్పుడు మంటే వస్తుంది. పాపం ఆ బ్రాహ్మడు బట్టలు అలా అయిపోవడం చూచి నిలువునా నీరయిపోయేరు. నాకు జాలివేసింది. "పూర్వజన్మంలో చేసుకున్న పాపానికి అనుభవం యిది" అని సమాధానం చెప్పుకుని మళ్ళీ వుతుక్కున్నారు. మా అక్కతో చెప్పేను, మానాన్న గుణాలకి అది మండిపడింది."

"మాది మూడంతస్తుల మేడ. ఆయనది గుడిసి - నిజంగా గుడిసి. అది స్థలంలో మధ్య వుంది. ఉత్తరం వేపున వీధిగుమ్మం. గుమ్మానికి రెండువేపులా

మల్లిపందిలీ; గులాబీ చెట్లు, యిలాంటి పువ్వుల మొక్కలు. వెనకవేపున నుయ్యి. మానాన్న మేడమీద కచేరీ చేస్తాడు. ఆహాలుకి వారి యింటి వేపుకి మూడు కిటికిటీలు వున్నాయి. వకదానిలోంచి వుమ్మేస్తే మల్లిపందిలిమీద పడుతుంది. వకదానిలో నుంచి వుమ్మేస్తే ఇంటి మీద పడుతుంది. ఇంకోదానిలో నుంచి వుమ్మేస్తే నూతిమీద పడుతుంది. కొన్నాళ్ళకి యిల్లూ, మల్లిపందిలీ పనగలిసిపోయాయి. నుయ్యి గూడా కొంతవరకు చెడిపోయింది. అది మొదలు ఆయన నూతినీళ్ళు వాడడం మానేశారు. గోదారి నుంచి తెచ్చుకునీవారు పాపం."

"పెళ్ళికాలేదు. అవడానికి డబ్బులేదు. వెనక దక్షత లేదు. కానయితే పండితుడే. రోజూ సత్యనారాయణ కథలు చెప్పీ, పూజలూ, అభిషేకాలూ చేయించీ సంపాదన చేసి కాలం గడుపుకునీవారు. పరిశుభ్రత యెక్కువ అవడం చేత యిల్లు గుడిసి అయినా ముద్దు వస్తుంది."

"ఖర్చు పెట్టటానికి వప్పుకోకపోయినా మానాన్నకి నేనంటే చాలా యిష్టమే. అయినా వోమాటు తప్పుకాదూ నాన్నా అలా చేస్తేనూ? అనేటప్పటికి "నీకెందుకదీ? నోరుమూసుకుని యింట్లోకి పో" అన్నాడు. చెప్పవద్దూ? నాకు రవులుకు పోయింది. "యింకోమాటు చెయ్యి" అనుకున్నాను మనస్సులో."

"వకనాడు నాలుగ్ఘళ్ళ పొద్దువేళ పాపం ఆయన యెవరితోటో స్నేహితుడితో మాట్లాడుతూ మల్లిపందిలికీ కొంచెం దగ్గిరగా కూచున్నారు. యిద్దరూ నవ్వుకుంటున్నారు. యేమిటో చెప్పుకుంటూనూ. నవ్వు విని నేను చూశాటప్పటికి మానాన్న మళ్ళీ వుమ్మేశాడు. ఆయన మీద పడింది. స్నేహితుడు తెల్లబోయి "యేమిటి" అన్నాడు. అంతావిని "నేను సాక్ష్యం యిస్తాను. ఛార్జీ పెట్టు" అన్నాడు. కాని ఆయన తొందరపడలేదు. "మనుష్యుల దగ్గిర ఛార్జీపెడితే లాభంలేదు. ఇక్కడ న్యాయం అన్యాయం అవుతుంది. అన్యాయం న్యాయం అవుతుంది. అసలే ఆయన ప్లీడరు. ఆయనకి వ్యతిరేకంగా యే ప్లీడరూ మన పక్షంలో పని చెయ్యడు. మనం ఫిర్యాదు చెయ్యనే అక్కర్లేదూ. ఈశ్వరుడు అందరి పుణ్యపాపాలూ విచారించి అనుభవం కలిగిస్తాడు. సూర్యుడూ చంద్రుడూ దిక్కులూ – ఇలాంటి ప్రకృతి సాక్ష్యం కావలసినంత వుంది మనకి" అన్నారు. స్నేహితుడు అనేకవిధాల తొందరపెట్టేడు గాని వారు వినలేదు.

"నాకు జాలేగాదు. కళ్ళమ్మట నీళ్ళు వచ్చేయి. దు:ఖం పొంగిపోయింది. శరీరం తెలిసిందిగాదు. ఇంతట్లో మాఅక్క వచ్చి చూసింది. "ఏడవకమ్మా; దీనికి నేను వుపాయం చేస్తాన"న్నది. నాకు కొంచెం దు:ఖం పోయింది. ఆయన స్నేహితుడు వెళ్ళిపోయాడు. మానాన్న షికారు వెళ్ళేడు. గుమాస్తాలు గదిలో రాసుకుంటున్నారు. చీకటి పడింది. ఆయన గోదావరికి బయలుదేరారు. గుమ్మంలో మా అక్కా నేనూ యెదురుపడ్డాం. తెల్లబోయి "యిదేమిటి?" అంటే మా అక్క "చెబుతాను రండి" అని లోపలికి తీసుకువెళ్ళింది. నేను కూడానే వున్నాను."

"తండ్రి తప్పుచెయ్యడమూ, కూతుళ్ళు బతిమాలడమూను. పావుగంటదాకా వప్పుకోలేదు ఆయన. మా అక్క నీళ్ళు తోడింది. నేను తలంటేను. అరగంటలో అంతా ముగించుకుని యింటికి వెళ్ళిపోయాము. ఈసంగతి యెవరికీ తెలవలేదు."

"పదిరోజులు గడిచేయి. ఆయనికో స్నేహితుడు వున్నాడు. అంతకంటే బీదవాడూ అయినా శాస్త్రం చదువుకున్నాడు. తెలుగు పండితుడుగా వున్నాడు వక స్కూలులో. వండిపెట్టే దిక్కులేదు. పెళ్ళికాలేదు. అయ్యే వుపాయాలు లేకపోయాయి. పిల్లల్ని అమ్ముకునీవాళ్ళు యెవరో సంచులు కొద్దీ గుమ్మరిస్తే యిస్తారట. ఏమిటీగతి అని ఆలోచించి మా వీధులోనే వక బీదబ్రాహ్మడికి వితంతుకూతురు వుండగా దాన్ని పెళ్ళాడాడు. మా వీధులోగూడా వూరేగారు. ఆ వూరేగింపులో రామశర్మగారు వున్నారు. పెళ్ళిగూడా దగ్గిర వుండి చేయించారుట."

"మానాన్నకి మళ్ళీ సందు దొరికింది. వెలిపెట్టాలన్నాడు. పదిమందితోటీ చెప్పేడు. సంయే అంటే సంయే అనుకున్నారు. బ్రాహ్మడికి చిక్కు వచ్చింది. మా అక్కా నేనూ ఆలోచించాము. మర్నాడు రాత్రి నేను పట్టుకు వెళ్ళి వందరూపాయలిచ్చేను. చాలా సేపటిదాకా పుచ్చుకోలేదు ఆయన. బతిమాలేను తప్పదన్నాను. "తండ్రి బాధపెట్టడమూ, కూతుళ్ళు అభిమానించుకోవడమూ బాగాలేద"న్నారు. మీరు కూడా బాధపడతారన్నాడు. ఏం చెప్పినా నేను వినలేదు. సరే అని పుచ్చుకున్నారు."

"మర్నాడు సాయంకాలం మానాన్నకి జడిసి ఆయన చాపవేసికొని అంగాస్త్రం పరుచుకుని దూరంగా పడుకున్నారు. ఛాతీమీద గులాబీపువ్వులు వున్నాయి. పక్కలో పుస్తకం వుంది. ఏదో దీర్ఘాలోచన చేస్తున్నారు. అలాంటప్పుడు నేను చూశాను. మనస్సు యెలాగో అయింది. అలాగే నుంచుని పోయాను. మాఅక్క వెనక్కాలే వచ్చి నుంచుంది. నేనెరగను. "ఎవర్తి పెళ్ళాడుతుందో, సుఖపడుతుంది. శాంతం అయినవాడు. డబ్బులేకపోయినా మంచివాడు" అనుకున్నాను. మా అక్కవిని "యేమిటే" అంది. సిగ్గయింది నాకు. చెప్పమ్మా అంది. పెళ్ళిమీదకి మనస్సు పోతోందా అంది. సుఖపడు అంది. నన్నింటోకి తీసుకుపోయింది."

"మెల్లిగా మాఅక్క చాలా మాటలు అడిగింది. నాకు సిగ్గు పొంగుకుని వచ్చింది. "నీయిష్టం" అన్నాను. "నువ్వు పెళ్ళాడతావా?" అంటే "నాకు వద్దు. నువ్వు పెళ్ళాడు. నీకు చాకిరీ చేస్తూ నువ్వు సుఖపడితే సంతోషింతాను. నాకంతే చాలు" అంది. తొందరపెట్టింది."

"ఆ రాత్రి అంతా పడుకున్నాక నన్ను తీసుకువెళ్ళి ఆయనతో మాట్లాడింది. "కష్టాలు పడుతున్నా ప్రాణాలు నిలిచేయి. ఇదే అయితే యిక ఆశలేద"న్నారు. మా అక్క ధైర్యం చెప్పింది. ఆవేళ వారు వప్పుకోలేదు. నాకేడుపు వచ్చింది. "చూశారా" అని మాఅక్క అనేటప్పటికి ఆయన మనస్సు కరిగింది. దగ్గిరికి వచ్చారు. మాఅక్క దూరంగా పోయింది. కళ్ళనీళ్ళు తుడిచి "యేడవకు" అన్నారు.

పాదాలమీద పడి "రక్షించండి" అన్నాను. మనస్సు కరిగింది. "సరే" అన్నారు. మా అక్క వచ్చి "యేర్పాట్లు చేసుకోండి" అని చెప్పి నన్ను తీసుకుపోయింది."

"మన్నాడే పెళ్ళి ముహూర్తం. నాకు సిగ్గు తలమునకలైంది. భయం వేసింది. కాళ్ళు వడికేయి. మాఅక్క ఆలోచన మీద నాలుగ్ఘళ్ళ పొద్దువేళ చుట్టాల యింటికని చెప్పి వూళ్ళోకి వెళ్ళేను. దీపాలు పెట్టేదాకా వున్నాను. గుమ్మం దిగేటప్పటికి వారు యెదురుగుండా వచ్చేరు. సందు మళ్ళేక జట్కా యెక్కించారు. ఏడుగంటలికి వీరేశలింగంపంతులు గారి తోటలోకి వెళ్ళాం. యెనిమిది గంటలికి పెళ్ళి అయిపోయింది. తొమ్మిది గంటలకల్లా వూళ్ళో తెలిసిపోయింది."

"రాత్రి పదిగంటలయింది. భోజనాలయి కూర్చునివుండగా పంతులుగారు వచ్చి ముందు సంగతి అడిగేరు. "దూరదేశం వెళ్ళిపోతాం" అని వారు చెప్పేరు. పంతులుగారు ఆలోచిస్తున్నారు. నాకేమీ తోచలేదు."

"ఇంతలో మాఅక్కయ్య వచ్చింది. నాన్న వస్తున్నాడంది. భయం లేదంది. ప్రాణాలు కొంచెం తేరుకున్నాయి. పంతులుగారు మాట్లాడి వచ్చి నన్ను తీసుకువెళ్ళేరు."

"తల్లీ నువ్వు మళ్ళీ పెళ్ళాడినందుకు నాకు విచారం లేదు; గాని నాతో చెబితే యింతకంటే మంచిసంబంధం తెస్తును. చాలా వైభవంగా పెళ్ళి చేస్తును" అన్నాడు. ఇదంతా విని నేను తెల్లపోయాను. "ఆశ్చర్యం అక్కర్లేదు. నీభర్త నాకు యిక ఉత్తరాధికారి. పూర్వపు సంగతులన్నీ యిప్పుడే మరిచిపోయాన"న్నాడు."

"నాకు సంతోషంతో ఉక్కిరిబిక్కిరి అయింది. మానాన్న చెప్పగా పంతులుగారు వారిని తీసుగువచ్చేరు. హఠాత్తుగా మానాన్న వారి రెండు చేతులూ పట్టుకొని "జరిగిపోయిందంతా నేనిప్పుడే మరచి పోయాను. నువ్వుగూడా మరిచిపో. నా అఖండమైన ఆస్తినీ, నా చిట్టితల్లినీ నీచేతులో పెడుతున్నాను" అన్నాడు. వారు మాట్లాళ్ళేకపోయారు."

"అప్పుడే యింటికి వెళ్ళిపోయాం. మర్నాడు మానాన్న గొప్ప విందుచేసి వూరిలో అందర్నీ పిలిచేడు. దేశకాలపాత్రాల్ని యెరిగి మసిలీవారంతా వచ్చేరు. అంతా ఆనందించారు."

"ఇప్పుడు మానాన్న పెత్తనం అంతా వారి మీదే పెట్టేశాడు. నేను యిలాంటి సుఖం పొందినందుకు మా అక్క చాలా సంతోషంగా వుంది. వారికి మానాన్న చేసిన అపకారాన్ని తీర్చుకున్నాను గదా" అని నాకు తృప్తిగా వుంది. అప్పటికంటే యిప్పుడు వారు శాంతమూర్తులై వున్నారు."

❀ ❀ ❀